ప్రజాశక్తి

శుక్రవారం 21 ఏప్రిల్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

పేట నుంచి టిక్కెట్ ఇస్తే పోటీ

కన్నా నన్నేకాదు చంద్రబాబునూ ఏడిపించారు

అయినా పార్టీ కోసం పని చేస్తాం

మాజీ ఎంపి రాయపాటి వ్యాఖ్యలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో తనను చంద్రబాబు నాయుడు నర్సరావుపేట నుంచి పోటీ చేయాలంటే చేస్తానని మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు అన్నారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో డబ్బు లేక ఓడిపోయాయని, ఈసారి తన వద్ద డబ్బులున్నాయని చెప్పారు. డబ్బులేకపోయినా టిడిపికి గాలి వస్తుందన్నారు. తనకు అవకాశం ఇవ్వకపోతే తనకుమారుడు రంగారావుకు సత్తెనపల్లి, పెదకూరపాడులో ఏదో ఒకచోట ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలన్నారు. తన తమ్ముడు కుమార్తె రాయపాటి శైలజకు టిక్కెట్ అడుగుతున్నట్టు

2లో

వైసిపి నాయకులపై అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలోని పాత మల్లాయపాలెంలో దళితుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వైసిపి నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా పాత మల్లాయపాలెంలో జరిగిన సంఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ఎస్‌సి కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదుకు జిల్లా ఎస్పీని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ ఆదేశించారు. దీనిపై వివరాల ప్రకారం.. పాతమల్లాయపాలేనికి చెందిన నీలం జ్యోతి సాగర్ గ్రామంలోని మరికొందరితో కలిసి ఈనెల14న అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అనంతరం రాత్రి

2లో

పెరిగిన ఉక్కపోత



- ఉదయం చల్లాగా.. మధ్యాహ్నం వడగాల్పులు..
- పల్నాడు జిల్లాలో 20 మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు
- గుంటూరు జిల్లాలో 12 మండలాల్లో వేడిగాలులు
- రాజుపాలెంలో 43.5 డిగ్రీలు నమోదు
- నడిఎండలో ఇళ్లకు చేరుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వాతావరణంలో మార్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గురువారం ఉదయం కొద్దిసేపు వాతావరణం చల్లగా ఉన్నా అనంతరం ఎండ తీవ్రత పెరిగింది. ఉదయం 7.30 గంటలనుంచి ఎనిమిది గంటల వరకు ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమై వాతావరణం చల్లబడింది. 9 గంటల నుంచి ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నం నుంచి వేడిగాలులు మొదలయ్యాయి. రాత్రి వరకు ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు.

ఉష్ణోగ్రతలు పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. అదనపులోడ్ రిలీఫ్ పేరుతో రాత్రి వేళ గ్రామాల్లో కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. గురువారం గుంటూరు జిల్లాలో 12, పల్నాడు జిల్లాలో 24 మండలాల్లో వడగాల్పులు వీచాయి. రాజుపాలెంలో అత్యధికంగా 43.5, సత్తెనపల్లిలో 42.8, పెదనందిపాడు, కొల్లిపరలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన మండలాల జాబితాలో అమరావతి, అచ్చంపేట, బెల్లంకొండ, బొల్లాపల్లి, చిలకలూరిపేట, దాచేపల్లి, దుర్గి, గురజాల, ఈపూరు, కారెంపూడి, క్రోసూరు, మాచవరం, మాచర్ల, ముప్పాళ్ల, నాదెండ్ల, నర్సరావుపేట, నకరికల్లు, పెదకూరపాడు, పిడుగురాళ, రెంటచింతల, రొంపిచర్ల, సత్తెనపలి, శావల్యాపురం, వెల్దుర్తి, వినుకొండ మండలాలున్నాయి. గుంటూరు జిల్లాలో చేబ్రోలు, దుగ్గిరాల, గుంటూరు, కొల్లిపర, మంగళగిరి, మేడికొండూరు, పెదకాకాని, పెదనందిపాడు, ఫిరంగిపురం, తాడేపల్లి, తెనాలి, తుళ్లూరు మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు

2లో

అప్పుల బాధతో యువ కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - నరసరావుపేట

ఘటనా స్థలిలో మృతదేహం

అప్పుల బాధ తాళలేక యువ కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రావిపాడులో గురువారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఆముదాల శ్రీనివాసరావు (31) తనకున్న ఎకరంతోపాటు మరో ఐదారు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి, పత్తి, మొక్కజొన్న సాగు చేశాడు. రెండేళ్ల వరుస నష్టాలతోపాటు ఈ ఏడాదీ పత్తి ప్రారంభంతోనే పరుగు సోకి దెబ్బతినడం, ఇటీవల వర్షాలకు మొక్కజొన్న దెబ్బతినడంతో అప్పులే మిగిలాయి. దీనికి తోడు తండ్రి

2లో

9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - రొంపిచర్ల

తెలిసీ తెలియని వయసులో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సంతగుడిపాడులో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన జగదీశ్వరి సంతగుడిపాడులోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ స్థానిక హైస్కూలులో 9వ తరగతి చదువుతోంది. మండలంలోని కర్లకుంటకు చెందిన గుంజి రమేష్‌తో జగదీశ్వరికి కొంతకాలం కిందట పరిచయం ఏర్పడింది. వీరు రెండ్రోజుల కిందట పాఠశాల వద్ద ఓ ఇంట్లో తరగతుల విరామ సమయంలో కలుసుకున్నారు. విరామం సమయం ముగిసినా జగదీశ్వరి పాఠశాలకు రాకపోవడంతో

2లో

8 లో

మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

విత్తనాలు, ఎరువులు రాయితీపై ఇవ్వాలి

నియంతృత్వ బిజెపిని తరిమికొట్టండి

5 పే

- 24న మంగళగిరిలో బహిరంగ సభను జయప్రదం చేయండి
- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ఏడాదిలోగా వాటర్‌గ్రిడ్ పూర్తి : ఎమ్మెల్యే

2 పే

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం) : 6.29

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిన ఉక్కపోత

నమోదయ్యాయి. వేసవి తీవ్రత నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ వడగాల్పులు వీస్తున్నాయి. సాయంత్రం 5 గంటల తరువాత వేడిగాలులు కొంతమేరకు తగ్గుముఖం పడుతున్నాయి. వేసవి తీవ్రత వల్ల ఆర్‌టిసి బస్సుల్లో పగటి వేళ ప్రయాణికుల సంఖ్య తగ్గినట్లు ఆర్‌టిసి వర్గాలు తెలిపాయి. పట్టణ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు జనసంచారం తక్కువగా ఉంటోంది. పొలాల్లో పనులు చేస్తున్న కూలీలు, ఉపాధి హామీ కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రోడ్డుపక్కన వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు కూడా ఎండ తీవ్రతకు అల్లాడుతున్నారు. పాఠశాలలు ఈ ఏడాది 12.30 నుంచి 12.45 వరకు కొనసాగిస్తున్నారు. గతంలో 12 గంటలకు మూసివేసేవారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసి ఇళ్లకు వెళ్లే సరికి 1.30 గం టలవుతోంది. ఈ క్రమంలో విద్యార్థులు పాఠశాలల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇళ్లకు వెళ్లడానికి అవస్థ పడుతున్నారు.

అప్పుల బాధతో యువ కౌలురైతు ఆత్మహత్య

అనారోగ్యం వల్ల ఆస్పత్రికి ఖర్చులయ్యాయి. ఇంటికి ఒక్కడే కొడుకు కావడంతో ఈ ఆర్థిక భారాన్నంతటినీ శ్రీనివాసరావే మోయాల్సి వచ్చింది. దీంతో అప్పులు పేరుకుపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం ఉదయం ఇంటి నుండి వెళ్లిన శ్రీనివాసరావు రాత్రయినా రాకపోవడంతో కుటుంబీకులు గాలించారు. బంధువులు, స్నేహితల వద్ద వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. గురువారం తెల్లవారుజామున నరసరావుపేట పట్టణ సమీపంలోని వల్లపచెరువు - కేతిముక్కల అగ్రహారం మార్గంలో రోడ్డు పక్కన పొలాల్లో వ్యక్తి పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలిని పరిశీలించిన పోలీసులు విచారణ చేపట్టగా శ్రీనివాసరావుగా తేలడంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్థారణకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించి మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఇ.బాలనాగిరెడ్డి తెలిపారు. మృతునికి తల్లిదండ్రులతోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ఉపాధ్యాయులు ఆమె తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. అనంతరం జగదీశ్వరి, యువకుడు కలిసి ఇంటి నుండి వస్తూ కనిపించడంతో ఉపాధ్యాయులు దండించారు. దీనిపై మనస్థాపానికి గురైన జగదీశ్వరి గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసు కుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నరసరావు పేట డీఎస్పీ విజయభాస్కరరావు, ఎస్ఐ సిహెచ్.సురేష్ ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. గుంజి రమేష్‌ను అదుపులోకి తీసుకుని మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వైసిపి నాయకులపై అట్రాసిటీ కేసు

8 గంటల సమయంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొంతమందితో కలిసి జ్యోతిసాగర్ కూర్చుని ఉండగా స్థానిక వైసిపి నాయకులు యేనిరెడ్డి శంకరరెడ్డి, తంభా కోటిరెడ్డి, కాసు సీతారామిరెడ్డి, యేనిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు తమ అనుచరులతో వచ్చి జ్యోతి సాగర్, నీలం ప్రవీణ్ కుమార్, నీలం వినయ్, నీలం అంటోనితో గొడవపడ్డారు. కులం పేరుతో దూషించి వారిపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ గురువారం రాత్రి ప్రత్తిపాడుకు వచ్చి స్థానిక అధికారులతో చర్చించారు. పాతమల్లాయపాలెం ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు మీడియాకు తెలిపారు.

పేట నుంచి టిక్కెట్ ఇస్తే పోటీ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. నర్సరావుపేట అభ్యర్థిగా స్థానికులకు అవకాశం ఇవ్వాలని, రాయలసీమకు చెందిన బిసికి అవకాశం ఇస్తే ఉపయోగం లేదని అన్నారు. ఆ అవకాశం ఏదో స్థానిక బీసీలకు ఇవ్వాలన్నారు. తాను వృద్ధుణ్ణి అయినా అన్నిచోట్లా పర్యటిస్తానని అన్నారు. కన్నాతో తనకు రాజీలేదని, ఆయన తనను పదేళ్లు ఏడిపించి ఆ తర్వాత కోర్టులో రాజీ పడ్డారని తెలిపారు. చంద్రబాబునూ కన్నా ఏడిపించారని, అయితే కొన్ని కారణాల వల్ల టిడిపిలో చేరారని చెప్పారు. ఎన్ని విభే దాలున్నా చంద్రబాబు నాయకత్వంలో కన్నాతో కలిసే పని చేస్తామని, ఆయన ఎక్కడ పోటీ చేసినా గెలుస్తారని చెప్పారు. తాను ఏ ఇన్‌ఛార్జులకూ వ్యతిరేకంగా ఇతరులను ప్రోత్సహించడం లేదని, ఏమైనా ఉంటే చంద్రబాబుకే చెబు తానని అన్నారు. మాచర్ల టిక్కెట్ బ్రహ్మారెడ్డికి ఇస్తే కచ్చితంగా గెలుస్తాడని, అవినీతి లేని వ్యక్తులకు టిక్కెట్ ఇవ్వడం మంచి దని రాయపాటి వ్యాఖ్యానించారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి: గుంటూరు కలెక్టర్

ప్రజాశక్తి - గుంటూరు

వేసవిలో వడగాల్పుల దృష్ట్యా ఉద్యోగులు, ప్రజలు మధ్యాహ్నం 1-3 గంటల్లోపు సాధ్యమైనంత వరకూ బహిరంగ ప్రదేశాలకు రాకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్ కలెక్టర్, ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ గురువారం సమీక్షించారు. ఎండ, వడగాల్పుల నుంచి రక్షణ పొందటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచురించిన పోస్టర్లను అన్ని సచివాలయాల వద్ద ప్రదర్శించాలన్నారు. పట్టణాల్లో ప్రధాన రహదారులు, ముఖ్యకూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని, అవసరం మేరకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. స్పందన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, సాధ్యమైనంత వరకు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, పరిష్కరించటానికి వీలుపడని అర్జీలపై కారణాలను దరఖాస్తుదారులకు వివరించి సరియైన పద్ధతిలో ఎండార్స్మెంట్ ఇవ్వాలని చెప్పారు.

అర్జీలు సక్రమంగా పరి ష్కరించే విధానంపై సచివాలయ ఉద్యో గులకు ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. ఉపాధి హామీ పనులు 100 రోజులు కల్పిం చేలా గ్రామాల్లో పనులు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. రెవెన్యూ అంశాలపై జెసి రాజకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ నిర్దేశిత సమయంలో సక్రమంగా పూర్తయ్యేందుకు ఎఫ్‌పిఒఎల్‌ఆర్‌లో గుర్తించిన మ్యూటేషన్లు, కరెక్షన్ల దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని, దరఖాస్తుల పరిష్కార పురోగతిపై రోజు వారీగా నివేదిక అందించాలని అన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, డ్వామా పీడీ యుగంధర్‌కుమార్, సీపీవో శేషశ్రీ, సర్వే ఏడీ రూప్లానాయక్, పంచాయ రాజ్ ఎస్ఇ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూ ఎస్-ఎస్ఇ సురేష్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గర్భిణిలు, బాలింతలు రక్తహీనతను అధిగమించాలి

సమీక్ష సమావేశంలో పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-నరసరావుపేట

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు మారుమూల తండాలలో నివసించే గర్భిణిలు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనతను అధిగమించాలని ఆ దిశగా లక్ష్యం నిర్దేశించుకుని పని చేయాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ శివ శంకర్ దిశా నిర్దేశం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,మండల వైద్యాధికారి, అంగన్వాడి ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. సుస్థిర ప్రగతి లక్ష్యాలు సాధించేందుకు సంబంధించిన అం శాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి మండలంలో గుర్తించిన రక్తహీనత ఉన్న గర్భిణులకు, 10 నుంచి 19 ఏళ్ల కిశోర బాలికలలో ఉన్న రక్తహీనతను తగ్గించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. మూడు నెలల కాలంలో గర్భిణిలలో రక్తహీనతను 23 శాతం వరకు, 10 నుండి 19 ఏళ్ల మధ్య వయస్సు గల కిశోర్ బాలికలలో ఉన్న రక్తహీనతను ఆరు నెలల్లో 50 శాతం తగ్గించేందుకు లక్ష్యం నిర్దేశించుకొని పని చేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధా నంలో ప్రతి డాక్టర్ నెలకు రెండుసార్లు గ్రామం లో పర్యటించి విలేజ్ హెల్త్ క్లినిక్,అంగన్వాడీ సెంటర్లు, పాఠశాలలు సందర్శించి అన్ని వ్యాధులకు తగు చికిత్స అందించాలని ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, గర్భవతులు, బాలింతలు మరియు టీబి వ్యాధిగ్రస్తులను గుర్తించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

ఏడాదిలోగా వాటర్‌గ్రిడ్ పూర్తి

- ఇళ్ల కూల్చివేతలో నా ప్రమేయం లేదు
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి గ్రామానికీ తాగునీరు సరఫరా అవు తుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యా లయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కారంపూడి కొండపై 14 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ నిర్మాణం పనులు జరుగుతున్నాయని, బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల, నూజెండ్ల మండలం రవ్వారం కొండపై, ఈపూరు వినుకొండ ప్రాంతాల్లోనూ 169 మీటర్ల ట్యాంక్ నిర్మాణం చేపట్టి ఎన్‌ఎస్‌పి, బుగ్గవాగు నుండి తాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. దీనిపై అధికారులతో ఇప్పటికే చర్చించామని, పనులు ఏడాదిలోపు పూర్తవుతాయని అన్నారు. వినుకొండ పట్టణంలో రూ.161 కోట్లతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. వినుకొండ పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో నిర్మాణాల కూల్చివేతకు తమకు సంబంధం లేదని, వక్ఫ్ బోర్డు సిఇఒ ఆదేశాల మేరకు వారు కూల్చివేశారని చెప్పారు. ఇంటి స్థలం ఉండి గృహ నిర్మాణం చేపట్టేవారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5 వేలమంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జగనన్న కాలనీ, టిట్కో ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదార్లకు ఇస్తామన్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడి జన్మదినం సందర్భంగా ఎంపీ జయదేవ్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు జరిగాయి. మాజీ మంత్రివర్యులు మాకినేని పెదరత్తయ్య,తూర్పు నియోజకవర్గ ఇంచార్జి నసీర్ అహ్మద్, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాకినేని రత్తయ్య మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ముందుచూపు,క్రమశిక్షణ విషయ పరిజ్ఞానం అవగాహన బాధ్యత దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగిన వ్యక్తిగా అభివర్ణించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. తూర్పు నియోజకవర్గంలోని లాల్‌జాన్ భాష కల్యాణ మండపంలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. టిడిపి నాయకులు కంచర్ల శివరామయ్య, పోతినేని శ్రీనివాసరావు, ఓంకార్, మహిళా నాయకులు పాల్గొన్నారు. **గుంటూరు లీగల్:** టిడిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భ:గా ఏర్పాటు చేసిన కేకును టిడిపి తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నసీర్ అహ్మద్ కట్ చేశారు.

పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో తెలుగుదేశం సీనియర్ నాయకులు రావి శివరామకృష్ణ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు. నిర్వహించారు, శివరామకృష్ణయ్య మాట్లాడుతూ అభివద్ధి, సంక్షేమం కలగలిపి ప్రజా పాలన అందించగల సమర్థుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు, తొలుత 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని పెదనందిపాడు లో నిర్వహించారు.టిడిపి నాయకులు దివ్వి నాగరాజు, చెన్నుపాటి సురేంద్ర, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలోని తాడేపల్లి మండల టిడిపి కార్యాలయంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ముందుగా కేక్ ను తెలుగుదేశం పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు కట్ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ 2024 లో ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, తెలుగు మహిళా నాయకురాలు దాసెట్టి అరుణ, తెలుగు యువత నాయకులు కె.అశోక్,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలిలోని స్థానిక కొత్తపేటలోని టిడిపి కార్యాలయంలో నాయకులు కేక్‌ను కట్ చేశారు. శివాజి చౌక్, గెయిటీ థియేటర్ వద్దనున్న అన్నా క్యాంటీన్లలో అన్నదానం చేశారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న పెమ్మసాని థియేటర్‌లో, ఐతానగర్ లింగారావు సెంటర్లో, ప్రముఖ న్యాయవాది ఎస్.రామారావు కార్యాలయంలో చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. స్థానిక 24వ వార్డురైల్వే గేటు వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. మండల కేంద్రమైన కొల్లిపరలోని టిడిపి కార్యాలయం వద్ద కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తుళ్లూరు మండలంలోని మందడం, ఉద్దండరాయునిపాలెం రైతు దీక్షా శిబిరంలో మాజీ చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి.రైతులు శిబిరాల్లో చంద్రబాబు చిత్ర పటాన్ని ఉంచి కేక్ కట్ చేశారు. పొన్నూరు పట్టణంలోని శ్రీ ఆంజనేయస్వామి స్వామి దేవాలయం లో చంద్రబాబు పేరుతో టిడిపి నాయకులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దుగ్గిరాలలోని అలీ నగర్ వద్ద చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోవెలమూడి ఆధ్వర్యంలో ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కుంచనపల్లిలో..

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత మృతి

న్యాయం చేయాలని మృతదేహంతో రోడ్డుపైన బంధువుల ధర్నా

అత్తింటి వారిని అరెస్టు చేస్తామనే పోలీసుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

కుటుంబ కలహాలతో జరిగిన గోడవ కారణంగా మండలంలోని పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన మహిళ వణుకూరి సామ్రాజ్యం (40) ఫిబ్రవరి 10న ఆత్మహత్యా యత్నం చేసింది. గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతు సామ్రాజ్యం పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం సామ్రాజ్యం భౌతిక కాయాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో బంధువులు పాత మల్లాయపాలెం సెంటర్‌లో సామ్రాజ్యం శవాన్ని ఉంచి రాస్తారోకో, ధర్నా చేశారు. ఆమె మామ పనిరెడ్డి, ఇతర కుటుంబ సభ్యుల వేధింపులతోనే ఆమె ఆత్మహత్య యత్నం చేసిందని బంధువులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నపుడు ప్రత్తిపాడు సిఐ బాధితురాలి వద్ద స్టేట్‌మెంట్ నమోదు చేయలేదని, ముద్దాయిపై చర్యలు కూడా తీసుకోలేదని మీడియాతో తెలిపారు. న్యాయం చేసే వరకు ఆందోళన

కొనసాగిస్తామని ఈ సందర్భంగా సామ్రాజ్యం బంధువులు తెలిపారు. అర్బన్ డిఎస్‌పి ప్రశాంతి ఆందోళనకారులకు రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వాలని, శుక్రవారం ఉదయం వారిని అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అధికారులతో మాట్లాతున్న మేయర్, అప్పిరెడ్డి తదితరులు

బ్రాడీపేట 4వ లైను అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

బ్రాడీపేట 4వ లైన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. గురువారం స్థానిక 32వ డివిజన్‌లోని బ్రాడీపేట 4వ లైన్‌లో రూ.1.20 కోట్లతో యన్.సి.ఎ.పి (నేషనల్ క్లియర్ ఎయిర్ పొల్యుషన్) కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించతలపెట్టిన డ్రైన్ టూ డ్రైన్ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి మ్యాప్‌లను ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాడీపేట 4వ లైన్‌ను అన్ని విధాల అభివద్ధి చేయటానికి చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే ఇప్పటికే 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ.50 లక్షలతో సైడ్ డ్రైన్ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. అలాగే రోడ్డు నిర్మాణానికి కూడా ప్రతి పాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకష్ణ, అందుగుల సంతోష్, బోడపాటి ఉషారాణి కిషోర్ కుమార్, కాంద్రుకుంట గురవయ్య, గుంటూరు జిల్లా గ్రంధాలయాల సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ఈ.ఈ సుందర రామిరెడ్డి పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద మౌలిక సదుపాయాల కల్పన

రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా ప్రాంతాలలో నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలను నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయడు ముస్లిం మత పెద్దలతో కలిసి గురువారం పరిశీలించారు. రంజాన్ పండుగ రోజున ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకొనే ప్రాంతాలైన నగరంపాలెం రోడ్డు రమేష్ హాస్పిటల్ వద్ద గల ఈద్గా, పొన్నూరు రోడ్డులోని ముస్లిం కళాశాల వద్ద ఉన్న ఈద్గా ప్రాంతాలలో ముస్లిం మత పెద్దలతో కలిసి పర్యటించి సదరు ప్రాంతాలలో నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు.రంజాన్ పండుగ ఏప్రిల్ 22న రానున్నదని, ప్రార్ధనలు నిర్వహించుకోవటానికి వచ్చే ముస్లిం సోదరులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈద్గా ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు, జంగల్ క్లియరెన్స్, త్రాగు నీరు, టెంట్లు, కూలర్లు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్లు మహమ్మద్ అబీద్ బాష, సాదు ఉమామహేశ్వరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి అభ్యర్థి ఆర్కేనే

రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

ప్రజాశక్తి-మంగళగిరి



సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆలోచనే ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ఆలోచన అని, మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలన్నదే ఎమ్మెల్యే ఆర్కే ధ్యేయమని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగర పర్యటనకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయం అనేది సేవ అని, ప్రజా సేవకు కావలసిన ప్లాట్ ఫాం ను తయారు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్కే ఎంతో కష్టపడి పని చేస్తున్నాడని, మంచి పేరు తీసుకొస్తున్నాడని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల నే మంగళగిరి లో కచ్చితంగా పోటీ చేస్తాడన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్కే పోటీ చేసినప్పుడు కొన్ని అనివార్య కారణాల వల్ల అండగా నిలబడలేకపోయామని, ఈసారి ఎమ్మెల్యే ఆర్కేకు ఖచ్చితంగా తాను, తన కుటుంబం అండగా ఉంటుందన్నారు. అయినా ఎన్నికలకు చాలా సమయం ఉందని, సీట్లు కేటాయింపు అనేది పార్టీ వ్యవస్థాగత నిర్ణయమన్నారు. మంగళగిరి అంటేనే కమ్యూనిస్టు భావాలు ఉన్న ప్రాంతమన్నారు. పేదవారికి, కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉండాలనే ఆలోచన కమ్యూనిస్టు భావమని, అటువంటి భావన సీఎం జగన్ మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే ఆర్కేకు ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు 34 లక్షల పట్టాలు మంజూరు చేయడంతో పాటు కొన్ని లక్షల ఇళ్లు నిర్మిస్తే ప్రతి పక్షాలు ప్రభుత్వం రెండు మూడు లక్షల కోట్లు అప్పులు చేసిందని విమర్శించడం సరికాదన్నారు.

ఇళ్లు కూల్చివేతపై విచారణ చేపట్టిన అధికారులు

బాధితుల డీకే పట్టాల పరిశీలన

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో వైసిపి నాయకులు, వారి అనుచరులు కలిసి ఇల్లు, స్వీట్ షాప్ అక్రమ కూల్చివేతల పై వినుకొండ తాసిల్దార్ కిరణ్ కుమార్, కమిషనర్ బి. శ్రీనివాసులు, పట్టణ సీఐ అశోక్ బాబు గురువారం విచారణ చేపట్టారు. వక్ఫ్ బోర్డు స్థలాల్లో నిర్మాణాలను తొలగించాలని ఈనెల 18న వైసిపి వర్గీయులు సుమారు 150 మంది పైగా దౌర్జన్యం చేసి ఇల్లు, షాప్ నిర్మాణాలను కూల్చి వేసిన సంఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. బాధితులు స్వీట్ షాప్ యజమాని శివశంకర్, ఇంటి యజమాని తిరుపతిరావు, కామా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాము నివాసం ఉంటున్న స్థలాలు కొనుగోలు చేసినవని, రెండు మూడు లింక్ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయని వివరించారు. కొంతమంది వ్యక్తులు ఈ భూమి వక్ఫ్ బోర్డుకు సంబంధించినవని ఖాళీ చేయాలంటూ హెచ్చరించడంతో తాము కోర్టును ఆశ్రయించామన్నారు. స్థల వివాదం కోర్టులో జరుగుతుండగానే ఈనెల 17వ తేదీన కొందరు వ్యక్తులు తమ వద్దకు వచ్చి ఖాళీ చేయాలని హెచ్చరించగా తమ ఆస్తులకు రక్షణ కల్పించాలని టోల్ ఫ్రీ నెంబర్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశామన్నారు. ఇద్దరు కానిస్టేబుళ్లు తమ ఇళ్ళ వద్దకు వచ్చి వెళ్లడం జరిగిందన్నారు. 18వ తేదీ ఉదయం సుమారు 150 మంది వైసీపీ వర్గీయులు మూకుమ్మడిగా దాడి చేసి స్వీట్ షాపు, తమ రెండు ఇళ్ళను కూల్చివేసి నేలమట్టం చేశారని వివరించారు. తమ ఆస్తులకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేసిన కాపాడలేదన్నారు. పట్టపగలు దౌర్జన్యంగా ధ్వంసం చేస్తుంటే అధికారులు పట్టించుకోలేదన్నారు. బాధితుల నుండి జరిగిన నష్టం పై రెవెన్యూ అధికారులు వాంగ్మూలం నమోదు చేశారు. అలాగే ఈద్గా వద్ద సుమారు 10 ఇళ్లకు సంబంధించిన నిర్మాణాలను కూల్చివేత పై కూడా విచారణ చేపట్టారు. యంత్రాలతో వచ్చి ఇంటి నిర్మాణాలను కూల్చివేయటమే కాక, తాగునీటి బోర్లను కూడా ధ్వంసం చేశారని తాసిల్దార్ కిరణ్ కుమార్ వద్ద బాధితులు వాపోయారు. సర్వేనెంబర్ 927/3 20 ఎకరాలకు పైగా రాళ్లగుట్ట ప్రభుత్వ భూమి కలదని, 1999లో ఈ ప్రాంత నివాసితులకు ప్రభుత్వం డీకే పట్టాలు మంజూరు చేసిందని వివరించారు. రాళ్లగుట్ట పోరంబోకు భూమిలో ఉన్నామని చెబుతున్న దౌర్జన్యంగా తమ ఇంటి నిర్మాణాలను ధ్వంసం చేశారని వాపోయారు. ఈ మేరకు బాధితుల నుండి ఫిర్యాదులు తీసుకున్న రెవెన్యూ అధికారులు వారి వద్ద ఉన్న డీకే, పొజిషన్ పట్టాలను సేకరించారు. సమగ్ర విచారణ చేపట్టి బాధితుల ఫిర్యాదు మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - ముప్పాళ్ల : ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మాదల పెట్రోలు బంక్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన మృతుడు దామర్ల రాము (52), అతని తమ్ముడు లక్ష్మీనారాయణతో కలసి ద్విచక్రవాహనం మీద మాదల తిరుణాళ్లకు వచ్చారు. ఈక్రమంలో పెట్రోలు అయిపోవడంతో లక్ష్మీనారాయణ పెట్రోలు బంక్‌లోకి వెళ్లాడు. ఈసమయంలో దామర్ల రాము మూత్ర విసర్జనకు రోడ్డు మీదకు వచ్చాడు. ఈ సమయంలో సత్తెనపల్లి వైపుగా అతివేగంగా వెళ్ళుతున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని సత్తెనపల్లి వైద్యశాలకు తరలించిన కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణం, బైపాస్‌రోడ్డు, కౌశిక ఆదిత్య అపార్ట్‌మెంట్, ప్లాట్ నెం. సి3, లక్ష్మీగణపతి నగర్ (హైవే టవర్స్ వెనుక), నివాసం వుంటున్న గుడిపూడి శ్రీనివాసరావు తండ్రి వీరయ్య పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయునది. ఈ నెల అనగా 15-4-2023 మా ఇంటి నుండి తాడేపల్లి అండర్‌పాస్ వద్ద గల పెట్రోల్‌బంకు సమీపంలోని జిరాక్స్ మిషన్ షాపు వద్దకు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు జిరాక్స్ తీసుకోవడానికి వెళ్ళాను. నా ద్విచక్ర వాహనం దిగిన తర్వాత చూసుకుంటే నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినట్లు గమనించితిని. తిరిగి వెతికినను కనిపించలేదు. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ A4753861videHYDP03645597 నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింద పేర్కొన్న సెల్ నెంబర్‌కు తెలియజేయగలరు.

గుడిపూడి శ్రీనివాసరావు,
సెల్ : 7780558848

ఒరిజినల్ దస్తావేజు పోయినది

నా క్లయింట్ అయిన పల్నాడు జిల్లా నరసరావుపేట, శ్రీనివాసనగర్ కు చెందిన మదిరె వెంకట శివ ప్రసాద్ రెడ్డి S/o చిన్న రంగారెడ్డి సమాచారం మేరకు ఇచ్చిన బహిరంగ ప్రకటన ఏమనగా నా క్లయింట్ ది. 14-04-2023 న శ్రీనివాస నగర్ నుండి బస్టాండ్ దగ్గరికి ద్విచక్ర వాహనంపై వచ్చు సందర్భంలో ఒరిజినల్ దస్తావేజులు ఉన్న కవర్ మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. దస్తావేజు నెం. 14722/2010 నెం గల Construction Agreement Plot No.301 నరసరావుపేట SRO కి చెందిన దస్తావేజును జిరాక్స్ నిమిత్తం తీసుకువస్తున్న ఎక్కడో పడిపోయినవి. కావున పైన తెలిపిన దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల నాకు కానీ నా క్లయింట్ కు కానీ వారంలోపు అందజేయవలసిందిగా కోరడమైనది.

ఇట్లు.
ఎం.రవికాంత్, ఎస్.రామహనుమంత రెడ్డి,
న్యాయవాదులు, నరసరావుపేట.
సెల్ నెం : 9440213550

ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి నా క్లయింటు అయిన వేముల యలమంద తండ్రి ఏడుకొండలు, ఆర్/ఓ జానపాడు గ్రామం తెలియజేయునది ఏమనగా... నా క్లయింటు తన జాబ్ పరంగా గత కొంతకాలంగా ఖతార్‌లో ఉంటున్నందున తన పేరును ఉపయోగించుకొని తన కుటుంబ సభ్యులు కాని మరియు తన బంధువులు, స్నేహితులు కాని ఏ విధమైన అప్పులు చేసినను, ఏ విధమైన తప్పుడు పనులు చేసినను తనకు సంబంధం లేదని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

ఇట్లు
పెండేల చంద్రకళ,
అడ్వకేట్, పిడుగురాళ్ళ
ఫోన్ : 9440668769.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం. 46/20

బిట్వీన్:
ఎం.అనసూర్య .... వాది
మరియు
కూనాగు భాస్కరరావు తండ్రి శ్రీరంగయ్య
గ్రామము : పిడుగురాళ్ళ టౌన్, మండలం, పల్నాడుజిల్లా- 522413 ... ..ప్రతివాది

పై దావాలోని ప్రతివాదికి కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను పలుమార్లు దావా సమన్లు పంపిననూ ప్రతివాది తీసుకొనక కాలయాపన చేయుచున్నాడు. మరియు ప్రతివాది గత కొంతకాలంగా ఇక్కడ ఉండటం లేదని రిపోర్టు వచ్చినందున పై కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు అందజేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున ది. 09-05-2023న ఉదయం 10-30 గం.లకు పై కోర్టుకు మీరు గానీ, మీ అడ్వకేటు కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
పెండేల చంద్రకళ,
అడ్వకేట్, పిడుగురాళ్ళ
ఫోన్ : 9440668769.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం. 28/21

బిట్వీన్:
కొప్పరపు శివయ్య .... వాది
మరియు
కొనకండ్ల కాశీరామారావు, తండ్రి పూర్ణచంద్రరావు, ఆర్/ఓ, పిడుగురాళ్ళ టౌన్, మండలం, పల్నాడు జిల్లా - 522413 ... ..ప్రతివాది

పై దావాలోని ప్రతివాదికి కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను పలుమార్లు దావా సమన్లు పంపిననూ ప్రతివాది తీసుకొనక కాలయాపన చేయుచున్నాడు. మరియు ప్రతివాది గత కొంతకాలంగా ఇక్కడ ఉండటం లేదని రిపోర్టు వచ్చినందున పై కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు అందజేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున ది. 11-5-2023న ఉదయం 10-30 గం.లకు పై కోర్టుకు మీరు గానీ, మీ అడ్వకేటు కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
పెండేల చంద్రకళ,
అడ్వకేట్, పిడుగురాళ్ళ
ఫోన్ : 9440668769.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం. 96/22

బిట్వీన్:
కొప్పరపు గురవయ్య .... వాది
మరియు
కొనకండ్ల కాశీరామారావు, తండ్రి పూర్ణచంద్రరావు, ఆర్/ఓ, పిడుగురాళ్ళ టౌన్, మండలం, పల్నాడు జిల్లా - 522413 ... ..ప్రతివాది

పై దావాలోని ప్రతివాదికి కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను పలుమార్లు దావా సమన్లు పంపిననూ ప్రతివాది తీసుకొనక కాలయాపన చేయుచున్నాడు. మరియు ప్రతివాది గత కొంతకాలంగా ఇక్కడ ఉండటం లేదని రిపోర్టు వచ్చినందున పై కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు అందజేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున ది. 09-05-2023న ఉదయం 10-30 గం.లకు పై కోర్టుకు మీరు గానీ, మీ అడ్వకేటు కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
పెండేల చంద్రకళ,
అడ్వకేట్, పిడుగురాళ్ళ
ఫోన్ : 9440668769.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.29/21

బిట్వీన్:
కొత్త లక్ష్మీనారాయణ .... వాది
మరియు
కొనకండ్ల కాశీరామారావు, తండ్రి పూర్ణచంద్రరావు, ఆర్/ఓ, పిడుగురాళ్ళ టౌన్, మండలం, పల్నాడు జిల్లా - 522413 ... ..ప్రతివాది

పై దావాలోని ప్రతివాదికి కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను పలుమార్లు దావా సమన్లు పంపిననూ ప్రతివాది తీసుకొనక కాలయాపన చేయుచున్నాడు. మరియు ప్రతివాది గత కొంతకాలంగా ఇక్కడ ఉండటం లేదని రిపోర్టు వచ్చినందున పై కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు అందజేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున ది. 09-05-2023న ఉదయం 10-30 గం.లకు పై కోర్టుకు మీరు గానీ, మీ అడ్వకేటు కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
పెండేల చంద్రకళ,
అడ్వకేట్, పిడుగురాళ్ళ
ఫోన్ : 9440668769.

పరికరాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న సిబ్బంది

అగ్నిమాపక పరికరాలపై ప్రత్యేక ప్రదర్శన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులు, ప్రజలకు కేంద్ర ఇన్‌ఛార్జి ఎస్.భాస్కర్‌బాబు వివరించారు. నిఖిల టెక్నో స్కూల్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలే కాకుండా ప్రతి ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడ్డంలో అగ్నిమాపక సిబ్బంది చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయగా విద్యార్థులు సందర్శించి వివిధ పరికరాల పని విధానం, రెస్క్యూ పరికరాల వాడే విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిఖిల్ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట తిరుపతిరావు, సామాజిక వేత సుబ్బారెడ్డి, లీడింగ్ ఫైర్ మాన్యులు ఆర్.మాణిక్యరావు, వి.నాగేశ్వరరావు, ఎస్.వెంకయ్య, పవన్ కుమార్, శివనాగేశ్వరరావు, రాజు, చిన్నబ్బాయి, కరిముల్లా, కృష్ణ పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - నూజెండ్ల

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ప్రవేశాలకు గడువును ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లు నూజెండ్లలోని పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి ఫోన్ ద్వారా మేసేజ్ వస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థి తమ ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువకరణ పత్రాలు, పాస్‌ఫోర్టు సైజు ఫొటోలు, ఫోన్ నంబర్‌ను తీసుకుని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమావేశం లో మాట్లాడుతున్న ఎంపిడిఒ సత్యనారాయణ

జిల్లా పరిషత్ స్థలాలను పరిశీలించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మండలంలోని జెడ్‌పి స్థలాలను పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలను ఎంపిడిఒ జివి సత్యనారాయణ ఆదేశించారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ కె.నగేష్‌తో కలిసి సమావేశ మయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్థలాలు, గ్రామాల్లోని జిల్లా పరిషత్ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే నంబర్ల వారీగా నివేదిక ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకం గడువు పొడిగింపు

ప్రజాశక్తి - రెంటచింతల

మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లు ఎంపిడిఒ గౌసియా బేగం తెలిపారు. తల్లిదండ్రులు లేని, ఆదరణ కోల్పోయిన అనాథ విద్యార్థులకు ఆర్థిక భరోసా నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఎంపికైన వారికి నెలకు రూ.4 వేలు చొప్పున అందించనున్నట్లు తెలిపారు. అర్హులు ఐసిడిఎస్ కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ సూచించారు.

వ్యవసాయ కూలీ.. సొమ్మసిల్లి..

- మండుటెండల్లో మిర్చి కోతలకు మహిళలు
- వడదెబ్బకు గురవుతున్న కూలీలు
- కూలి డబ్బులన్నీ వైద్యానికే ఖర్చవుతున్న దైన్యం
- వైద్యశాఖ నిర్లిప్తతపై విమర్శలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రమాదం తలమీద మిలమిల మండుతున్నా పొట్టకూటి కోసం తట్టుకోక తప్పడం లేదు. క్షేమంగా ఇంటి వచ్చేదాక భయం వెంటాడుతూనే ఉంటోంది. వ్యవసాయ పనులు చేసే మహిళా కూలీను వడదెబ్బ నిత్యం ఆందోళనకు గురిచేస్తోంది.

నియోజకవర్గంలోని నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో కొద్దిరోజులుగా మిర్చి చివరి దశ కోతలు కోస్తున్నారు. ఈ పనులకు చిలకలూరిపేట పట్టణంలోని నెహ్రూనగర్, సాంబశివ నగరం, రాగన్న పాలెం, సంజీవ నగరం, పట్టణ శివారు కాలనీల్లోని పేదవాడల మహిళలు సుమారు 1500 మంది రోజూ వెళు_న్నారు. తెల్లవారుజామున 5 గంటలకు బయలుదేరి ఆటోల్లో పొలాలకు చేరుకుని 11 గంటల వరకూ పనులు చేస్తారు. ఆ తర్వాత ఇంటికి వచ్చి మళ్లీ మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లి సాయంత్రం 6 గంటల వరకూ పని చేస్తారు. ఇందుకుగాను ఉదయం పూట పనికి రూ.300, సాయంత్రం పూట రూ.150 మొత్తంగా రూ.450 వరకూ కూలీలకు దక్కుతుంది. ఇందులో ఆటో ఛార్జీలు రూ.50 పోను రోజుకు రెండు పూటలా పని చేస్తే వచ్చే కూలి రూ.400. ఇలా వారమంతా సెలవు లేకుండా పనికి వెళ్తే రూ.2,400 వరకూ వస్తుంది.

ప్రతిరోజూ రెండు పూటలా ఎండలో పని చేయాల్సి రావడం, పొలంలో పని

మిర్చి కోతల్లో కూలీలు



వడదెబ్బపై జాగ్రత్తలను పేర్కొంటూ ప్రభుత్వం రూపొందించిన పాంప్లేట్

చేస్తుండగా వచ్చే ఆవిరి, మిర్చి కోరు, ఆటోల్లో కిక్కిరిసిన ప్రయాణం దరిమిలా కూలీలు వడదెబ్బకు ప్రభావితుల వుతున్నారు. దీనికితోడు రెండు వారాలుగా ఉష్ణోగ్రతలు 40-42 డిగ్రీల వరకూ నమోదవుతుండడంతో పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. మిర్చి కోతలకు వెళ్లేవారు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వడదెబ్బకు గురవుతూనే ఉన్నారు.

పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన మహిళ ఇటీవల యడ్లపాడు మండలం తిమ్మాపురానికి మిర్చి కోతలకు వెళ్లిన సందర్భంలో వడదెబ్బకు గురవగా హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రూ.4,500 వరకూ ఖర్చయ్యాయి. అంటే రెండు వారాల పాటు ఎండలో రెక్కలు ముక్కలు చేసుకుంటే వచ్చిన కూలి డబ్బులు మొత్తం ఆస్పత్రి ఖర్చులకే అయిపోయాయి. దీనికితోడు మరో వారం వరకూ పనులకు వెళ్లలేని పరిస్థితి. సంజీవ నగరానికి చెందిన మరో మహిళ దుస్థితీ ఇదే. పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లేవారూ ఇదే తరహా అనుభవాలను చెబుతున్నారు. మే మొదటి వారం వరకూ మిర్చి కోతలు ఉంటాయని, పెరిగే ఎండలకు తమ పరిస్థితి ఏమవుతుందోనని మహిళా కూలీలు దినదిన గండంగా పనులకు వెళ్లి వస్తున్నారు. పోనీ కొద్దిరోజులు ఇంటివద్దే ఉందామనుకుంటే పూట గడవదని, పని చేసుకుంటేనే నాలుగు వేళ్లూ నోట్లోకి వెళ్తాయని అంటున్నారు.

అవగాహన లేమి?

వేసవి తీవ్రత పెరుగుతోందని, ఏప్రిల్‌లోనే వేడి గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒక వేళ అస్వస్థతకు గురైతే పాటించాల్సిన పద్ధతులు, ప్రభుత్వాస్పత్రిలో అంతే వైద్యంపై వైద్యారోగ్య శాఖ అవగాహన సదస్సులేమీ నిర్వహించ లేదనే విమర్శలు వస్తున్నాయి. పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో అవగాహన సదస్సుల నిర్వహణ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ తదితర కార్యక్రమాలు అవసర మనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రుల్లో పోస్టర్లు పెడితే సరిపోదని, వాటిని ప్రజలకు చేర్చాలని అంటున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ గొంతెత్తాలి

సిపిఎం-సిపిఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రచారభేరి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజాధనాన్ని బడా పారిశ్రామిక వేత్తలకు అప్పనంగా దోచిపెడుతున్న కేంద్రంలోని బిజెపి విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఆ పార్టీలు చేపట్టిన ప్రచార భేరీలో భాగంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ప్రచారం నిర్వహించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.బాబురావులు మాట్లాడుతూ కులం, మతం జాతీయతల పేరుతో విద్వేషాలు రగిలిస్తూ దేశంలో మోడీ పాలన సాగిస్తున్నారని అన్నారు. బిజెపిని ఎంత త్వరగా గద్దె దింపితే దేశానికి అంత మేలన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు బి.మహేష్, ఎన్.లక్ష్మయ్య, రాజు, ఆదిత్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నాదెండ్ల

ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ గొంతెత్తాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఎం, సిపిఐ నాయకులు అన్నారు. నాదెండ్ల మండలంలో గణపవరం, నాదెండ్ల, తూబాడు, సాతులూరులో ప్రచారం చేయగా యాత్రను సిపిఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ ప్రారంభించి మాట్లాడారు. ప్రజల మధ్య బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ కూటమి విద్వేషాన్ని రగిలిస్తోందని, ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని మండిపడ్డారు. బ్రిటీష్ వారిని ఎదిరించి ఎన్నో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యమూ ప్రమాదంలో పడిందని, మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం

నాయకులు పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని బిజెపి కాలరాస్తోందని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో నాయకులు పి.రామారావు, పి.లక్ష్మాధికారి, సిహెచ్.నాగేశ్వరరావు, కోట్యానాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని పాటిగంతల బుడగ జంగాల కాలనీ, రజక కాలనీలో ప్రచారం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు పెరిగాయని, నిరుద్యోగ సమస్యను తీవ్రమైందని చెప్పారు. కార్మిక చట్టాలను కాలరాసేలా లేబర్ కోడ్లు తెచ్చారని విమర్శించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి జె.కృష్ణ నాయక్ మాట్లాడుతూ బిజెపి పాలనలో మైనార్టీలు, దళితులపై దాడులు పెరిగాయని, మత ఉద్రిక్తలను రెచ్చగొడుతోందని అన్నారు. పౌరసత్వం పేరుతో ముస్లిమ్ మైనార్టీలపట్ల

దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రజలు పెద్దఎత్తున కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేశ్వర్లు, షేక్ బాబు, ఎం.రామకృష్ణ, డి.కొండలు, చిన్నకోటయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి సిఐటియు నివాళి

ప్రజాశక్తి - మాచర్ల

మున్సిపార్టీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికురాలు టి.లక్ష్మి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు బి.మహేష్, తోటికార్మికులు సందర్శించి నివాళులర్పించారు. లక్ష్మి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నివాళులర్పిస్తున్న కార్మికులు, నాయకులు

నియంతృత్వ బిజెపిని తరిమికొట్టండి

సిపిఎం, సిపిఐ ప్రచార భేరీలో నాయకులు - పలుచోట్ల విస్తృత ప్రచారం

గుంటూరు సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు :బిజెపి అంటే భారతీయ జనతా పార్టీ కాదని, భారతీయ ఝూట్ పార్టీగా మారిందని సిపిఎం, సిపిఐ నాయకులు విమర్శించారు. బిజెపి హటావో, దేశ్‌కో బచావో నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నగరంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని కోరుతూ ఈరోజు నల్లచెరువు, ఆర్.అగ్రహారం, కన్యకా పరమేశ్వరి గుడి, ఏటుకూరు రోడ్డు, గాంధీ నగర్, చాకలి గుంట తదితర ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. అనంతరం నల్లచెరువు కమ్యూనిస్టు బొమ్మల సెంటర్‌లో సిపిఐ స్థానిక నాయకులు డి.విజయ్‌కుమార్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై. నేతాజీలు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి రాక ముందు 2014లో వంటగ్యాస్ ధర రూ.405లు ఉంటే దాన్ని రూ.300లకి తగ్గిస్తామని వాగ్ధానం చేసి ఇప్పుడు రూ.1200లుక పెంచిందని విమర్శించారు. స్వాతంత్రం వచ్చిన 70 ఏళ్లలో గత ప్రధానమంత్రులు అందరూ రూ.56 లక్షల కోట్లు అప్పు చేస్తే, 8 ఏళ్ల పాలనలో మోడీ రూ.100 లక్షల కోట్లు అప్పుచేసి, ప్రజలపై భారాలు మోపాడని మండిపడ్డారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సిపిఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, యం.ఏ.చిష్ఠి, నగర నాయకులు షేక్.ఖాశిం షహీద్, ఆది నికల్సన్, షేక్.ఖాశింవలి, సిపిఐ నాయకులు ఎ.అరుణ్ కుమార్, చిన్న, మరియదాసు, జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రులో ప్రచారం

తాడేపల్లిలో మాట్లాడుతున్న జొన్నా శివంకర్

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార బేరి కార్యక్రమాన్ని గురువారం నాడు రాజధాని గ్రామమైన నిడమర్రులో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపిని ఇంటికి సాగనంపి, భారతదేశాన్ని కాపాడాలని కోరారు. ఆంధ్రుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కును కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు అమ్మబోతున్న బిజెపి సర్కార్ 8 బడ్జెట్లలో రాజధాని నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహించారు. బిజెపి ప్రజా వినాశకర, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా వైసిపి, టిడిపి, జనసేన గళం విప్పాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, నాయకులు ఎం భాగ్యరాజు, కె వెంకటే శ్వర్లు, గైరబోయిన నాగేశ్వరరావు, కే నాగేశ్వరరావు, కే ప్రకాశరావు, సిపిఐ నాయకులు కట్టే పోగు, విజయకుమార్‌పాల్గొన్నారు

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

మండలంలోని ఆత్మకూరులో నిమ్మగడ్డ రామ్మోహన్ రావు కాలనీ నుండి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సిపిఎం ఆత్మకూరు గ్రామ కార్యదర్శి ఉద్దంటి దుర్గారావు అధ్యక్షతన సభలో నాయకులు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు,సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడారు. మోడీ అమిత్ షా లు కలిసి ఆదాని అంబానీలకు దేశంలో ఉన్న సహజ వనరులన్నింటినీ కట్టబెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. అలాగే రాజ్యాంగానికి మూల స్తంభాలుగా ఉన్న ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం వంటి గొప్ప విలువలను ఈ ప్రభుత్వం కాల రాస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు చిన్ని తిరపతయ్య, ముసలి పకీరయ్య, జాలాది జాన్ బాబు, కాబోతు ఈశ్వరరావు, వల్లభాపురపు సాంబశివరావు, పండల ప్రసాదు, పంతగాని మరియదాసు, పులివర్తి ప్రసాదుతదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్రంలోని బిజెపి పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని విధంగా ధరలు పైపైకి ఎగబాకుతున్నాయని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురోడ్డులో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార యాత్రను మూడో రోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముగ్దురోడ్డు, వడ్డెరకాలనీ, మున్సిపల్ కార్యాలయం, నెహ్రూ బొమ్మ సెంటర్, బోసు బొమ్మ సెంటర్, ఉండవల్లి సెంటర్, కెఎల్‌రావు కాలనీ, సీతానగరం, కొత్తూరు ప్రాంతాల్లో జాతా పర్యటించింది. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, వేముల దుర్గారావు, ఎ.శౌరిబర్తులం, ఎస్.ముత్యాలరావు, కె.మేరి, డి.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలని, దేశాన్ని కాపాడాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకర్, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ ఏరియా కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. గురువారం ఎం.టి.ఎం.సి పరిధిలోని ఇప్పటం గ్రామంలో సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో బిజెపి నిరంకుశ, మతోన్మాదం పరిపాలనకు వ్యతిరేకంగా ప్రచేర బేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దివాలా తీయించి, వ్యవసాయ రంగాన్ని సారవంతమైన భూమిని బడా కార్పొరేటర్ కి కట్టబెట్టడానికి ప్రయత్నం చేసిందన్నారు. రాష్ట్రాలకి న్యాయంగా రావాల్సిన నిధులు, అధికారాలను ఇవ్వకుండా రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుందనీ, రాష్ట్రాల హక్కులను కాపాడుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకై అన్ని వర్గాల ప్రజలు బిజెపి నిరంకుశ పరిపాలన వ్యతిరేకంగా పోరాడాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం దుర్మార్గమైన పరిపాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, బిజెపి ప్రభుత్వాన్ని సాధన పాసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి :ప్రజలపై పన్నుల రూపంలో భారం మోపుతున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. భావన్నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టేందుకు సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార యాత్ర గురువారం పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో కొనసాగింది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ములకా శివ సాంబి రెడ్డి , షేక్ హుస్సేన్ వలి, సిపిఐ నాయకులు పాశం వెంకటేష్ మద్దినేని కిరణ్ బాబు , చెక్రీ, ఎన్. రాజ్యలక్ష్మి, షేక్ ఆశ , పి చంద్ర కళ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- పెదకాకాని :నంబూరు గ్రామం లో సిపిఎం సిపిఐ ఉమ్మడిగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచడంతో పేదలపై పెనుభారం పడిందన్నారు. కార్యక్రమంలో పెదకాకాని సిపిఎం మండలం కార్యదర్శి నన్నపనేని శివాజి, సిపిఎం, సిపిఐ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, అప్పిరెడ్డి, సత్యన్నారాయణ, రెంటాల కుమారి పాల్గొన్నారు.

మంగళగిరి రూరల్‌లో

తెనాలి లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

24న బహిరంగ సభను జయప్రదం చేయండి

గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలను అవలంబిస్తున్న బిజెపికి వ్యతిరేకంగా 24వ తేదీన మంగళగిరి పట్టణంలోని ఆల్ఫా హోటల్ సమీపంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చంగయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పాశం రామారావు తన ప్రసంగానికి కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ఈనెల 24 తేదీన మంగళగిరిలో జరిగే బహిరంగ సభకు సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి, ఈమని అప్పారావు, నాయకులు జెవి రాఘవులు, వై కమలాకర్, జొన్న శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-మంగళగిరి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నియంతత్వ పాలనను తరిమికొట్టాలని గురువారం సాయంత్రం మంగళగిరి సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం సిపిఐ నాయకులు ఎస్ఎస్ చంగయ్య, చిన్న తిరుపతయ్య మాట్లాడుతూ తెలిపారు. 24వ తేదీన మంగళగిరి ఆటోనగర్ ప్రాంతంలో సాయంత్రం ఐదు గంటలకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లుగా వారు తెలిపారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఫిరంగిపురంలో ప్రచారం

ప్రజాశక్తి-ఫిరంగిపురం

స్థానిక మండల కేంద్రమైన ఫిరంగిపురంలో ప్రచార భేరిని తాసిల్దార్ కార్యాలయం నుండి సొలస బస్టాండ్ సెంటర్లో గల అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి షేక్ మస్తాన్ వలీ , నాయకులు మార్పుల వెంగళరెడ్డి, సిహెచ్ వెంకటేశ్వర్లు, అంకమ్మరావు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

పెదకాకానిలో మాట్లాడుతున్న పాశం రామారావు

పారిశుధ్య కార్మికులకు క్యాప్‌లు, తాగునీటి బాటిళ్లు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు: నగరంలో చెత్త తరలించే వాహనాల డ్రైవర్లు, క్లీనర్లకు యూనిఫారం ఇవ్వాలని, పారిశుధ్య, మలేరియా కార్మికులకు క్యాప్‌లు, వాటర్ బాటిళ్లు ఇవ్వాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు కోరారు. గురువారం నగర కమిషనర్‌కు కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందచేశారు. నగరంలో చెత్త తరలించే వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు సమారు 150 మంది ఉన్నారని నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్తను ప్రతిరోజూ డంపింగ్ యార్డుకు తరలించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులకు జిఎంసి నుండి ఇంత వరకూ యూనిఫాం ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికే కడప కార్పొరేషన్‌లో యూనిఫాం ఇచ్చారని, విజయవాడలో తమ యూనియన్ విజ్ఞప్తి మేరకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అదే విధంగా వేసవిని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య కార్మికులు, మలేరియా కార్మికులకు జిఎంసి ద్వారా క్యాప్‌లు, మంచినీళ్ల బాటిళ్లు ఇప్పించాలని కోరారు. ఇటీవల కడప కమిషనర్ కార్మికులకు ఆ విధంగా క్యాప్‌లు, బాటిల్స్ పంపిణీ చేశారన్నారు.

27 నుండి కెఎల్‌పిలో వేసవి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్లో వేసవి సెలవుల్ని పురస్కరించుకొని ఏప్రిల్ 27వ తేదీ నుండి మే 27వ తేదీ వరకూ అన్ని తరగతుల విద్యార్థులకూ వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకూ క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, స్కేటింగ్, కరాటే, మెటీరియల్ ఆర్ట్స్, చెస్, వెస్ట్రన్ డ్యాన్స్, కుకింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఇన్‌స్ట్రుమెంటన్ మ్యూజిక్ అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఒక్కో క్రీడాంశం గంట చొప్పున ఉంటుందన్నారు. కావున ఈ అవశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0863-2350392, 994822736 నంబరులో సంప్రదించాలన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలివ్వాలి

గల్లా జయదేవ్ పిఎకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు :ఇపిఎస్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్ 9వేలు, డిఎ, ఉచిత వైద్య సౌకర్యం, అందరికీ హైయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ అనుమతి ంచాలని, ఆన్‌లైన్‌లో నిబంధనలు సులభతరం చేయాలని, తదితర సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలని దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు గల్లా జయదేవ్‌కు వినతిపత్రం అందచేశారు. ఇపిఎస్-95 పెన్షనర్ల సమస్యలపై పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.గంగాధరరావు, జిల్లా అధ్యక్షులు కె.శివశంకరరావు, జిల్లా కార్యదర్శి జె.రామసుబ్బయ్య, వెంకట్రావు, శేషగిరి, జె.నాంచారయ్య, జ్ఞానేశ్వరరావు, ఎం.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మేడేను ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించాలి

ప్రజాశక్తి - మంగళగిరి : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను కార్మికులు ఘనంగా నిర్వహించాలని ఏపీ సెక్యూరిటీ గార్డ్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రమేష్ అన్నారు. గురువారం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ సమావేశం కే బుజ్జి బాబు అధ్యక్షతన జరిగింది. రమేష్ తన ప్రసంగానికి కొనసాగిస్తూ ఎయిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్, ఇతర ఉద్యోగులు సంఘటితంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. సంఘం బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఎనిమిది గంటల పని దినం కోసం జరిగిన పోరాటమే మేడే అని అన్నారు. మేడే కార్యక్రమాన్ని ఎయిమ్స్ కార్మికులు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చంగయ్య, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి విత్తనాలను బ్లాక్‌లో అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మిరప విత్తనాలు బ్లాక్ మార్కెట్లో అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖాధికారి నిత్యశ్రీ అన్నారు. ఈమేరకు గురువారం విలేకర్లతో మాట్లాడారు. బిల్లులు లేకుండా విత్తనాలను ఎవరూ కొనుగోలు చేయొద్దని, అధిక ధరలకు అమ్మిన వారిపైనా చర్యలుంటాయని చెప్పారు. నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు.

వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - రెంటచింతల

వ్యవసాయ పరికరాల కోసం రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలున్న ప్రతిరైతూ భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

మాట్లాడుతున్న నాయకులు, వేదికపై జీవీ ఆంజనేయులు

ఓటర్ల జాబితాలను జాగ్రత్తగా పరిశీలించండి

టిడిపి శ్రేణులకు జీవీ ఆంజనేయులు పిలుపు

ప్రజాశక్తి-నూజెండ్ల

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని టిడిపి శ్రేణులకు ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు టిడిపి మండల విస్తృత సమావేశం వినుకొండలో గురువారం నిర్వహించారు. సమావేశానికి టిడిపి నూజెండ్ల మండల అధ్యక్షులు ఎం.మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షత వహించారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఓట్లను అధికార వైసిపి తారుమారు చేస్తోందని, ఈ నేపథ్యంలో ఓటరు జాబితాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, మార్పులు, చేర్పులను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన, వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అవినీతి, అక్రమాలను ఇంటింటికీ వివరించాలని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు ఎం.శివప్రసాద్, నాయకులు ఎల్.వెంకటరావు, ఎం.సుబ్బారావు, వి.పేరయ్య పాల్గొన్నారు.

పిటిపి పాఠశాలలో అధికారుల బడినిద్ర

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని పిటిపి పాఠశాలలో ఎంపిడిఒ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు గురువారం బడినిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాఠశాలలో వంటశాలను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంఇఒ వి.నాగయ్య ప్రిన్సిపల్ కేతావత్ శీనునాయక్, వైస్ ప్రిన్సిపల్ జాన్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మా పందుల్ని కమిషనర్ అమ్ముకున్నారు

గవర్నర్‌కు పెంపకందారుల ఫిర్యాదు - విచారణ చేపట్టిన పులిచింతల డిప్యూటీ కలెక్టర్

వివరాలు చెబుతున్న బాధితులు

ప్రజాశక్తి - వినుకొండ

తమ పందులను వినుకొండ మున్సిపల్ కమిషనర్ అమ్ముకున్నారని పెంపకందారు అయిన దార్ల కోటేశ్వరరావు, మరికొందరు రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. గవర్నర్ ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ సి.శ్రీరాములు పల్నాడు జిల్లా కలెక్టర్ నియమించారు. ఈ నేపథ్యంలో వినుకొండకు గురువారం వచ్చిన విచారణాధికారి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధితులను, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ నుండి వివరాలు సేకరించారు. పందుల పెంపకం ప్రాంతమైన చెక్కవాగును పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని చెప్పారు. ఆయనవెంట తహశీల్దార్ కిరణ్ కుమార్ ఉన్నారు.

రూ.20 లక్షల పందులను అమ్ముకున్నారు

రూ.20 లక్షల విలువల చేసే పందులను కమిషనర్ దౌర్జన్యంగా పట్టుకొని అమ్ముకున్నట్లు ఫిర్యాదుదారు దార్ల కోటేశ్వరరావుతో పాటు 70 మంది బాధితులు డిప్యూటీ కలెక్టర్ వద్ద వాపోయారు. నాలుగు నెలల క్రితం నాలుగు లారీల్లో 400 పందుల్ని వివిధలవారీగా తీసుకువెళ్లారని చెప్పారు. వినుకొండలో సుమారు 100 కుటుంబాలకు చెందిన తాము మూడు తరాలుగా పందులు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే వినుకొండ ప్రాంతంలో పందులు ఉండడానికి వీల్లేదని కమిషనర్ హెచ్చరికలు జారీ చేయడంతో పట్టణానికి దూరంగా చెక్క వాగు వద్దకు వెళ్లామని, నాలుగు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్ సుమారు 40 మంది వ్యక్తులను పిలిపించి పందులను పట్టించి లారీల్లో తరలించారని, అడ్డుకున్న తమను, తమ కుటుంబీకులను పోలీసులతో బెదిరించి స్టేషన్లలో కూర్చోబెట్టారని వివరించారు. సుమారు 400 పందుల్ని పట్టుకుని బెంగళూరు మార్కెట్లో అమ్ముకున్నారని, ఒక్కొక్క పంది విలువ రూ.7-12 వేల వరకు ఉంటుందని చెప్పారు. కమిషనర్ చర్యలతో తాము అప్పులపాలయ్యామని వాపోయారు.

రెంటచింతలలో మహాత్ముడు నడయాడి నేటికి 84 ఏళ్లు

ప్రజాశక్తి - రెంటచింతల

జాతిపిత మహాత్మా గాంధీ రెంటచింతలలో పర్యటించి స్థానిక వైఆర్ఎస్ హైస్కూలు ప్రాంగణంలో బహిరంగ సభలో ప్రసంగించారు. అప్పట్లో ఆయనను రెంటచింతల తీసుకురావడానికి నాలం మట్టపల్లి పెరుమాల సాయన్న, దుగ్గరాజు నరసింహయ్య, ఏచూరి వెంకయ్య, గుండా వెంకటరత్నం, కట్టమూరు సంజీవయ్య తదితరులు వీరాల వెళ్లి దుగ్గిరాల గోపాలకృష్ణయ్యని కలిసి మహాత్ముని రెంటచింతలకు వచ్చేలా ఒప్పించారు. ఈ నేతలంతా బందర్లో గాంధీని కలిసి రెంటచింతలకు రావాలంటే నూలు వడుకు రాట్నాలతో వెయ్యి మంది ప్రదర్శనగా రావాలని గాంధీ కోరగా అందుకు నేతలంతా అంగీకరించారు. ఆ మేరకు గాంధీజీ 1929 ఏప్రిల్ 21న రెంటచింతలకు వచ్చి బహిరంగ సభలో మాట్లాడారు. ఆ సందర్భంగా వైఆర్ఎస్ హైస్కూల్ ప్రాంగణమంతా తాటాకు పందిర్లు వేసి 800కు పైగా రాట్నాలు ఏర్పాటు చేసి ఉదయం 11 గంటల నుంచి మూడు గంటల వరకు ఇక్కడే ఉండడం విశేషం. జలియన్ వాలాబాగ్ ఘటనలో తీవ్రంగా గాయపడిన పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ పేరున రెంటచింతలలో అదే రోజున ఎలిమెంటరీ పాఠశాలను మహాత్మా గాంధీ ప్రారంభించారు. ఆ పాఠశాల ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

సత్తెనపల్లిలో మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులుకు కేకును పెడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రామస్వామి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు 73వ పుట్టినరోజు సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు గురువారం వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా సత్తెనపల్లిలోని ఎన్‌టిఆర్ భవన్‌లో కేకును మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు కట్ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వై.రామస్వామి, నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు, ఎ.సాంబయ్య, బి.చంద్రశేఖర్, ఎ.అమరేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, పి.పెద్దిరాజు, కె.రామకృష్ణ పాల్గొన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని సాయి బాబా దేవాలయంలో వైవి ఆంజనేయులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కేకును కట్ చేశారు. సర్పంచ్ బి.విజయ్ రమాదేవి పాల్గొన్నారు. ముప్పాళ్లలో కేకును టిడిపి అధ్యక్షులు బి.నాగేశ్వరరావు కట్ చేశారు. పెదకూరపాడులోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా కేకును మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కట్ చేశారు. నరసరావుపేటలోని టిడిపి కార్యాలయంలో కేకును ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కట్ చేశారు. నాయకులు కె.రమేష్,షేక్ మీరావాలి, కె.కిరణ్, కె.బ్రహ్మయ్య, పి.రామిరెడ్డి పాల్గొన్నారు. టిడిపి డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు, వస్త్రాలు పంపిణీ చేపట్టగా మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాచర్లలోని టిడిపి కార్యాలయంలో కేకును నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి కట్ చేశారు. కె.శివారెడ్డి, కె.దుర్గారావు, వజ్రానాయక్, వీరాస్వామి, వేణు పాల్గొన్నారు. విజయపురిసౌత్‌లో టిడిపి మండల అధ్యక్షుడు నేరేటి వీరస్వామి ఆధ్వర్యంలో కేకును కట్ చేశారు. పిడుగురాళ్లలోని టిడిపి కార్యాలయంలో కేకును మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కట్ చేశారు. పట్టణ, మండల అధ్యక్షులు జె.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో కేకును కట్ చేస్తున్న మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, అరవిందబాబు తదితరులు

జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రంజాన్ పండుగ సందర్భంగా చిలకలూరిపేట నియోజకవర్గంలోని ప్రతి ముస్లిమ్ కుటుంబానికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ తరుపున రంజాన్ తోఫా అందిస్తున్నామని సంస్థ చైర్మన్ షేక్ జాన్‌సైదా అన్నారు. స్థానిక అడ్డరోడ్డు వద్ద గల తన కార్యాలయంలో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్‌సైదా మాట్లాడుతూ చిలకలూరిపేట పట్టణంలో 4 వేల కుటుంబాలకు తోఫా అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాదెండ్ల మాజీ ఎంపిపి కంజుల వీరారెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, వైసిపి నాయకులు చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, నాయుడు వాసు, అబ్దుల్ రవూఫ్, బివి రెడ్డి, గొంటు శ్రీనివాసరెడ్డి, బిళ్లా శివయ్య, ఎంవి రత్నారెడ్డి, షేక్ కరిముల్లా, కారపోల విజయభాస్కరరెడ్డి, వైఎస్ కరిముల్లా, చిట్టిబాబు, మానుకొండ శేషిరెడ్డి, నకరికంటి శ్రీకాంత్, శ్రీకాంత్‌రెడ్డి, కరీమ్, రఫీ, జిలాని, ఇమ్రాన్, అనిల్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఉత్సాహంగా ఉద్యోగినులు

ప్రజాశక్తి-బెల్లంకొండ

క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరక, మానసిక ఉల్లాసం పెరుగుతుందని తహశీల్దార్ నిర్మల అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెంలో విజ్ఞాన స్కూల్ మైదానంలో ఉద్యోగినులకు క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దార్ మాట్లాడుతూ గెలుపోటములు సమానంగా తీసుకోవాలని, క్రీడల్లో పాల్గొనడమే ముఖ్యమని అన్నారు. వైద్యాధికారి ఆమ్ సుదర్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాసన్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణ అభినందనీయమని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇఒఆర్‌డి వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

సూర్యనారాయణ కుటుంబానికి తోటి హెడ్ కానిస్టేబుళ్ల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నరసరావుపేట

ఫిరంగిపురం వద్ద ఈనెల 12వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ టి.సూర్యనారాయణ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సూర్యనారాయణ బ్యాచ్ (1993)కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు రూ.1.40 లక్షల సాయాన్ని మృతుని కుటుంబానికి సమకూర్చారు. ఈ మొత్తాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ (ఎఆర్) రామచంద్రరాజు ద్వారా సూర్యనారాయణ కుమార్తె ప్రవల్లికకు గురువారం అందజేశారు. ఇదే ఐక్యత, ఉదారతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఎఎస్‌పి ఆకాంక్షించారు. సూర్యనారాయణ కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, శాఖపరంగా రావలసిన సదుపాయాలన్నిటినీ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఎఒ రామారావు, ఎస్బీ సిఐ కోటేశ్వరరావు పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మాణిక్యాలరావు, ఏఏస్సై ఆంజనేయులు, భాస్కరరావు, అంకినీడు ప్రసాద్ పాల్గొన్నారు.

కుంచనపల్లి ఎస్సీ కాలనీలో
పడకేసిన పారిశుధ్యం

- దుర్గంధాన్ని భరించలేకున్నాం
- సిపిఎం నాయకుల ఎదుట స్థానికుల ఆవేదన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి దళితవాడలో పారిశుధ్యం మెరుగుపరచడంలో అధికారులు విఫలమయ్యారు. రోజుల తరబడి డ్రైనేజీ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగునీరు పోయే దారి లేక డ్రైనేజీ కాలువ దుర్గంధం వెదజలుతోంది. కాలువ పూడిక తీసారే కాని, చెత్త కుప్పలను తీయకుండా నిర్లక్ష్యం చేశారు. కుంచనపల్లి దళితవాడ ప్రధాన రహదారి వద్ద చెత్తకుప్పల దుర్గంధం వెద జల్లుతూ, పురుగులు ఇంట్లోకి వస్తున్నాయి. మన వైపు దోమల బెడదతో బెంబేలెత్తు తున్న పట్టించుకునే నాధుడే లేడంటూ పలువురు స్థానికులు వాపోతున్నారు. గురువారం సిపిఎం నాయకులు ప్రచార భేరి

కార్యక్రమం దళితవాడలో నిర్వహిస్తుండగా, 'మా దళిత వాడలో డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయడం లేదు' అంటూ సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి వద్ద స్థాని కులు వాపోయారు. ఈ సందర్భంగా వెం కటరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు పారి శుద్ధ్యం మెరుగుపరచడంలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. రోజుల తరబడి డ్రైనేజీ కాలువలు శుభ్రం పూడిక తీయకపోతే దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి గురవుతారని అన్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీ కాలవలను పూడిక తీయించి చెత్త కుప్పలను ఎత్తి, శుభ్రం చేయాలన్నారు. తక్షణమే సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి, కుంచనపల్లి దళితవాడలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలని, అధికారులను ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కష్ణ, అమ్మిశెట్టి రామారావు పాల్గొన్నారు.

జై భారత్ సత్యాగ్రహ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

బిజెపి నిరంకుశ పాల నకు నిరసనగా ఈనెల 24న విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్ లో జరిగే జై భారత్ సత్యాగ్రహ సభను జయప్రదం చేయాలని ఏఐసీసీ సెక్రటరీ ,కాంగ్రెస్ పార్టీ గుజరాత్ రాష్ట్ర ఇంచార్జి గేరా ఉషారాణి నాయుడు పిలుపు నిచ్చారు. స్థానికంగా ఆమె స్వగహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్లమెంటులో అధికార పార్టీ బిజెపి వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడిచే విధంగా ఉందని విమర్శించారు. దేశవ్యాప్తంగా నిత్యవసర వస్తువులు పెట్రోలు గ్యాస్ తదితర వస్తువుల ధరలు తదితరల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్యుడి బతుకు అగమ్య గోచరంగా మారిందని అన్నారు. మోడీని గద్దె దించే వరకూ ప్రజలను చైతన్య పరుస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. జై భారత్ సత్యాగ్రహ సభను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు.సమావేశంలో పిసిసి జనరల్ సెక్రెటరీ జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గుంటూరు సిటీ బిసి సెల్ సెక్రెటరీ డి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కెఎల్ స్టార్టప్ ఫౌండేషన్ ఐడియాథాన్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ విశ్వవిద్యాలయంలో అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ అద్వర్యంలో నిర్వహించిన కెఎల్ స్టార్టప్ ఫౌండేషన్ కమ్యూనిటీ సెంట్రిక్ ఐడియాథాన్‌ను విజయవంతంగా ముగించినట్లు ఎసిఐసి సిఇఒ అలోక్ గోవిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ నీతి ఆయోగ్, భారత ప్రభుత్వం మద్దతుతో కెఎల్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన కెఎల్ స్టార్టప్ ఫౌండేషన్ అధ్వర్యంలో కమ్యూనిటీ సెంట్రిక్ తొలి దశ ఐడియాథాన్‌ను నిర్వహించినట్లు తెలిపారు.ఎసిఐసి కెఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ సిఇఒ ఐడియాప్రెన్యూర్స్, స్టార్టప్‌లను ఉద్దేశించి ప్రసంగించినట్లు పేర్కొన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లు అంటే ఏమిటి వారి ఆలోచనలను స్టార్టప్‌లుగా అభి వృద్ధి చేయడానికి ఐడియా ప్రెన్యూర్‌లకు ఎలా మద్దతు ఇస్తుందనే అంశాలను వివరించారు. వారు ఎలా స్కేల్ అప్ చేయవచ్చునే దానిపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు చెందిన ఆవిష్కర్తలను వెలికి తీసేందుకు గాను ఈ ఐడియాథాన్ యొక్క ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఐడియాథాన్ లో దాదాపు 90 బందాలు పాల్గొని నూతన ఆవిష్కర్తలకు ఎదురయ్యే ఆయా రకాల సమస్యలకు పరిష్కారాలను అందించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపి ఆళ్ల

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి గురువారం పరిశీలించారు. కోనేరులో జరుగుతున్న మరమ్మతు పనులను, పాత బస్టాండ్ సెంటర్లో జరుగుతున్న చేనేత భవన్ నిర్మాణ పనులను, రాజీవ్ గహకల్ప లో జరుగుతున్న మగ్గాల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపి అన్నారు.

ప్రతాప్‌కు బహుముఖ ప్రజ్ఞాశాలి అవార్డు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణానికి చెందిన జొన్నా దుల ప్రతాప్.. బహుముఖ ప్రజ్ఞాశాలి అవా ర్డును పొందారు. ఇటీవల బెంగళూరులోని అశోక హోటల్ లో జరిగిన వరల్డ్ నెక్ట్స్ జన రేషన్ టెస్టింగ్ కాన్ఫరెన్స్ 2022లో కాలిఫోర్నియా నుండి పతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఎమర్జింగ్ టెస్టింగ్ లీడర్ ఆఫ్ ది ఇయర్ -2022 వరించిందని ప్రతాప్ తల్లిదండ్రులు జె. అరుణ, రాఘవులు గురువారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సాఫ్ట్ వేర్ రంగం లోని క్వాలిటీ విభాగంలో జరుగుతున్న నూతన అభివృద్ధి గురించి చర్చించారు. టెస్ట్ ఆటోమేషన్, మొబైల్ టెస్ట్ ఆటోమేషన్, లో కోడ్ లేదా నో కోడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఫర్ టెస్టింగ్ లాంటి అనేక అంశాలను వివరించారు. క్వాలిటీ ఎష్యూరెన్స్, సాఫ్ట్ వేర్ రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి అవసరమైన మెలకువలు గురించి వివిధ అంశాలను సోదాహరణంగా ప్రతాప్ వివరించారని అన్నారు. శ్రీ సిద్ధార్థ ద్వివేది , డాక్టర్ శంకర్ రామ మూర్తి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. వీరి తో పాటు వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతాప్ మంగళగిరి లో 1991 లో తమకు రెండవ సంతానంగా జన్మించారని తల్లిదండ్రులు తెలిపారు. చింతక్రింది కనకయ్య హైస్కూల్‌లో 10వ, తరగతి వరకు చదివాడని, . విజయవాడ నలంద జూనియర్ కళాశాల లో ఇంటర్ , నంబూరు వివిఐటిలో కంప్యూటర్ సైన్సు లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత కొంతకాలం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇసిఐఎల్‌లో ఉద్యోగం చేసినట్లు చెప్పారు. ఉన్నత చదువుల కోసం యుఎస్ వెళ్లి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడని,. అవకాశాల రీత్యా అక్కడే స్థిరపడినట్లు వివరించారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు గఫూర్ ఆధ్వర్యంలో గురువారం పేద మహిళలకు చీరల పంపిణీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు చేయూతనివ్వటం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కటారి హరీష్, అక్కిదాసు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

మెల్లంపూడిలో రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఏంటీఎంసీ పరిధిలోని మెల్లపూడిలో గురువారం తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో, మారుతి ఫౌండేషన్ అధినేత జంగాల సాంబశివరావు సహకారంతో 145 మంది ముస్లిం లకు రంజాన్ తోఫాను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గం టిడిపి పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, టిడిపి గుంటూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి పఠాన్ ఖాసింఖాన్, టిడిపి గ్రామ అధ్యక్షులు షేక్ నాగుల్, తెలుగు యువత నాయకులు షేక్ ఖాసిం బాబు, తెలుగు మహిళా మండల ఉపాధ్యక్షురాలు సొంటి కళ్యాణి, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కాటూరి పావని పాల్గొన్నారు .

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చివరి రోజున పొన్నూరు ఫైర్ స్టేషన్‌లో స్టాల్స్ ను ఏర్పాటు చేసి, అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించారు. సర్వీస్ లో ఏ విధంగా ఉపయోగపడతాయనే దానిపై సెయింట్ థామస్ స్కూల్ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ముగింపు కార్యక్రమంలో ఆర్‌టిసి డిఎం టి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వారితోపాటు వాసవి క్లబ్ అసోసియేషన్ సభ్యులు, పొన్నూరు అగ్నిమాపక కేంద్రాధికారి కె. ప్రసాద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారుడు బాబురావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో గురువారం ఎన్టీఆర్ నటించిన డాక్టర్ ఆనంద్ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు కంచర్ల బాబురావు ను కఠెవరం టీడీపీ నాయకులు కంచర్ల ఏడుకొండలు, నాగభూషణం, చంద్రశేఖర్, విజయ భాస్కర్, గౌరిశంకర్, వర్మ, పద్మారావు, మధుకిరణ్ తదితరులు ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, ఈదర వెంకటపూర్ణచంద్,డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ఎం.రాఘవరావు, కాకుమాను రాంబాబు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

డిసీజ్ ప్రివెన్షన్, ఫిట్నెస్‌పై అవగాహన

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక ప్రకాశం రోడ్డులోని ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో గురువారం పట్టణానికి చెందిన శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డిసీజ్ ప్రివెన్షన్ అండ్ ఫిట్నెస్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శారద మాట్లాడుతూ రోగ నియంత్రణ అనేది మన చేతుల్లోనే ఉంటుందని, సరైన ఆహార నియమాలు పాటించడం, మితాహారం, శారీరక వ్యాయామం వంటివి చాలా ముఖ్యమన్నారు. వయోభేదం లేకుండా సంక్రమిస్తున్న షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి సమస్యలపై వివరించారు. రెండు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో శుక్రవారం షుగర్, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు అలాగే విద్యార్థినులకు వివిధ రకాల క్యాన్సర్ సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కే రామచంద్, విద్యార్థులు పాల్గొన్నారు

పాలీసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు : పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి పాలీసెట్-2023 పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు నిష్ణాతులైన అధ్యాపకులతో నల్లపాడులోని ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఉచిత శిక్షణ ఈనెల 17న ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతోపాటు వసతి సౌకర్యం, తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో ఉచిత మెటీరియల్ ఇవ్వబడుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసి, పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు శిక్షణకు హాజరు కావచ్చన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీకి లైఫ్ సేవర్ అవార్డ్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకి వరుసగా 7వసారి లైఫ్ సేవర్ అవార్డు లభించిందని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్.రఘునాధర్ తెలిపారు. గుంటూరులోని తలసేమియా నీడ్స్ బ్లడ్ సెంటర్‌కు ఒక ఏడాది కాలంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ నుంచి ఎక్కువ మంది విద్యార్థులు రక్తదానం చేసినందుకుగాను యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ విభాగంలోని యూఈఏసీ (యూనివర్సిటీ ఎక్సటెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్)కు లైఫ్ సేవర్ అవార్డు అందించిందన్నారు. నీడ్స్ బ్లడ్ సెంటర్ ప్రెసిడెంట్ శ్రీధర్ ప్రశంసా పత్రంతో పాటు అవార్డును అందజేశారు. శ్రీధర్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ విద్యార్థులు, యూఈఏసీ టీమ్ సభ్యులు ఆపత్కాలంలో ఎంతోమందికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు.కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, యూఈఏసీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రం అందచేస్తున్న నీడ్స్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు

కబడ్డీ అంతర్జాతీయ పోటీల్లో వివేక విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

నేపాల్ యూత్ ఆఫ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12,13,14 తేదీలలో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ కబడ్డీ పోటీలలో పొన్నూరు వివేక జూనియర్ కళాశాల విద్యార్థి బండ్లమూడి పవన్ భారతదేశం తరపున పాల్గొని తన ప్రతిభను కనబరిచి భారత్ రన్నర్‌గా నిలవడంలో తన వంతు కషి చేశాడని వివేక విద్యాసంస్థల అధినేత చైర్మన్ రావిపాటి వీరనారాయణ గురువారం తెలిపారు. నేపాల్ లోని పోఖ్రా ఇంటర్నేషనల్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ కబడ్డీ పోటీలలో పాల్గొన్న బండ్లమూడి పవన్‌ను ఘనంగా వివేక కళాశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రావిపాటి వీరనారాయణ మాట్లాడుతు తమ కళాశాలలో చదువుతోపాటు క్రీడల్లో విద్యార్థులు కీలకంగా పాల్గొనడం ద్వారా వారిలో దాగి ఉన్న సజనాత్మక శక్తి బయటికి వస్తుందని తద్వారా మేధావులుగా సమాజానికి తీర్చిదిద్దబడతారని ఆయన పేర్కొన్నారు. పొన్నూరు మండల పరిధిలోని గ్రామమైన మన్నవ గ్రామం నుండి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న తల్లిదండ్రులు తమ బిడ్డను పట్టణంలోని వివేకా కళాశాలలో చదివిస్తున్నారని అటువంటి విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొని ప్రతి పని కనబడటంతో పాటు భారతదేశం సాధించిన 21 పాయింట్లలో పది పాయింట్లు పవన్ సాధించటం విశేషం అన్నారు. ఇటువంటి వారే నిజమైన హీరోలని ఆయన కొని ఆడారు. కార్యక్రమంలో డివిసి వివేక డైరెక్టర్ ఉప్పాల సుకుమార్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ భవానీ ప్రసాద్, డీన్ బోసు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ గోల్ కీపర్‌గా మధుబాబు

కమిషనర్ సహా పలువురు అభినందన

ప్రజాశక్తి-తెనాలి : హ్యాండ్ బాల్ జాతీయ జట్టు గోల్ కీపర్‌గా ఎన్నికైన పట్టణానికి చెందిన జ్రిపోతుల మధుబాబును ఐఆర్ఎస్ అధికారి, సెంట్రల్ జిఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ దోనేపూడి మధుబాబు అభినందించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో పేద విద్యార్థి మధుబాబు, చదువుతో పాటు క్రీడల్లో రాణించటం, జాతీయ జట్టులో స్థానం దక్కించుకోవటం తెనాలి ప్రాంతానికే గర్వకారణమని ఆయన అన్నారు. ఈనెల 25 నుంచి 30 వరకూ బల్గేరియాలో జరుగనున్న మెన్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న మధుబాబును ఈ సందర్భంగా పలువురు అభినందించారు. రూ.15వేలు ఆర్థిక సాయాన్ని దోనేపూడి మధుబాబు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ నాగరాజు, మేకల రవికుమార్, పినపాటి రవీంద్ర, పి.నిరంజన్, సౌపాటి కిరణ్, ఆళ్ళమూడి ప్రభాకరరావు, మేకల సురేష్, ఈపూరు ప్రేమ్‌కుమార్, గద్దల ఆల్విన్ పాల్గొన్నారు.

కోచ్ నాగరాజు ద్వారా ఆర్థికసాయం అందిస్తున్న మధుబాబు, తదితరులు

హ్యాండ్ బాల్ క్రీడాకారునికి చేయూత : పట్టణానికి చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారుడు జ్రిపోతుల మధుబాబు నేషనల్ టీంలో స్థానం పొందిన సందర్భంగా పట్టణ పలువురు అభినంధించారు. ఈనెల 25న బల్గేరియా వెళుతున్న సందర్భంగా మధుబాబును తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాటి అనుబంధ సంఘాలు సంయుక్తంగా రూ. 30 వేలు నగదును గురవారం అందించారు. ఈ సందర్భంగా క్రీడాకారుడు మధు బాబుని ఆర్యవైశ్య సంఘం సత్కరించింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు భాస్కరుని శ్రీనివాస రావు, ఆతుకూరి పూర్ణ చంద్ర రావు, చుండూరు సాయి, మద్దాలి శేషాచలం, మద్ది రామ కోటేశ్వరరావు, డి.సునీల్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కొమ్మూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగదును అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం బృందం

విత్తనాలు, ఎరువులు రాయితీపై ఇవ్వాలి

- పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే నేరుగా కొనాలి
- మిర్చిని వర్షాధార పంటగా ప్రకటించి రైతుకు అన్యాయం
- వరికపూడిసెలపై ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య

ప్రజాశక్తి - నరసరావుపేట

అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సూక్ష్మ ఎరువులు పురుగు మందులను రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై అందించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రైతులు సంక్షోభంలో ఉన్నారని, పంటలకు మద్దతు ధరలు కల్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని కోరారు. సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ మిర్చి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నారని, ఇప్పటికే కిలో రూ.1.70 లక్షల నుండి రూ.2 లక్షల వరకూ చేశారని చెప్పారు. పంట చేతికొచ్చే సమయంలో గత నెలలో అకాల వర్షాల వల్ల మొక్కజొన్న నేలవాలి రైతులు ఎకరాకు రూ.4-6 వేల వరకు ఖర్చు పెరిగిందని, పైగా నాణ్యత సాకుతో ఆ పంటను కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదని, తక్కువ ధరకు అడుగుతున్నారని అన్నారు. ఈ క్రమంలో నాణ్యతతో సంబంధం లేకుండా క్వింటాళ్ రూ.2,500కు ప్రభుత్వమే మార్కెట్ యార్డుల ద్వారా కొనాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఒక్క రూపాయి కూడా దక్కలేదని అన్నారు. జిల్లాలో పంటల బీమాలో అనేక సమస్యలున్నాయని, మిర్చిని వర్షాధార పంటగా ప్రకటించి రైతులకు అన్యాయం చేశారని, సాగర్ జలాల ద్వారా పల్నాడు జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైగా సాగు చేస్తున్న రైతులను బీమా దక్కకుండా చేయాలనే కుట్ర ఇందులో దాగుందని మండిపడ్డారు. నల్లి, తామర పురుగు, బొబ్బర తెగుళ్లతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని, నిబంధనలను సవరించి మిర్చికి బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వరికపూడిసెల ప్రాజెక్టుపై పాలకపార్టీలు ఊకదంపుడు ఉపన్యాసాలు మినహా కార్యాచరణ లేదని, తక్షణమే దానిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు. రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ ఒకవైపు నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందులు ఎరువులు, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలతో రైతులు కుదేలవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం సిగ్గుచేటన్నారు. బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలంలో మిర్చిపంట దెబ్బతినగా ఎకరాకు రూ.74 వేలు ఇచ్చారని, పల్నాడు జిల్లాలో మాత్రం రూ.2500 మాత్రమే ఇచ్చారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు అలంకార ప్రాయంగా ఉన్నాయని, పంటలు వివరాలు, నష్టం అంచనాలేవీ కేంద్రాల్లో లేవని, నష్టపరిహారం అందించే అంశంపైనా సరైన దిశా నిర్దేశం లేదని చెప్పారు. రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్ర, సాంకేతిక సలహాలు, సూచనలు ఇచ్చేలా పటిష్టంగా కేంద్రాలను నిర్వహించాలన్నారు. కఠిన చర్యలేమీ లేకపోవడంతో నకిలీ విత్తన తయారీదార్లు రెచ్చిపోతున్నారని, కల్తీ విత్తనాలు అమ్మినవారు, కంపెనీలపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వరికపూడిసెల ప్రాజెక్టు కోసం పోరాడతామన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్, రైతు సంఘం నాయకులు సిహెచ్.సురేష్‌రాజా, ముని వెంకటేశ్వర్లు, అంకిరెడ్డి, సత్యనారాయణ, రామాంజినాయక్, టి.సుబ్బారావు, ఇ.అప్పిరెడ్డి, ఎం.నరసింహారావు, ఎస్.కోటిరెడ్డి, జి.వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు నాయక్, ఆర్.వెంకటేశ్వర్లు, డి.పెదతాతారావు తదితరులు పాల్గొన్నారు.

మాతృమరణాలపై డిఎంహెచ్ఒ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అధ్యక్షతన జిల్లా స్థాయి మాతృ మరణాల మదింపు సమావేశం డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ 2023 మార్చిలో సంభవించిన ఒక మాతృ మరణంపై ఆరోగ్య కార్యకర్తలు, ఆషాలు, గర్భిణీస్త్రీలను నమోదు చేసిన దగ్గర నుండి వారిని తరచూ సందర్శించి వారి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారికి ఎప్పటికప్పుడు చేయించాల్సిన పరీక్షలు చేయించాలన్నారు. ప్రమాదకరమైన పరిస్థితులు గుర్తిస్తే వారిని వైద్యాధికారి వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించి, తగు జాగ్రత్తలు తీసుకుంటే మాతృ మరణాలు తగ్గించవచ్చన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రి నుండిగానీ, ప్రైవేటు ఆసుపత్రి నుండి గానీ కేసులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపినప్పుడు వెంటనే విషయం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి తెలియపరిస్తే ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకుంటారన్నారు. సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ శ్రవంతి, డాక్టర్ సుస్మిత, డాక్టర్ జాన్సీబాయి పాల్గొన్నారు.

సమీక్షలో పాల్గొన్న అధికారులు, వైద్యులు

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు పనిచేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో సమ్మర్ యాక్షన్ ప్లాన్, అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ.ఈ.లు తమ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా పర్యవేక్షణ చేయాలని, సచివాలయాల వారిగా ఎమినిటి కార్యదర్శులు పైప్‌లైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు వాటర్ స్యాంపిల్స్ తీయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమోదించిన అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని, పనులను ఏ.ఈ.లు ప్రత్యేక భాధ్యత తీసుకొని పూర్తి చేయాలన్నారు. మేజర్ డ్రైన్లలో పూడికతీత పనులకు టెండర్ ప్రక్రియ వెంటనే పూర్తి చేసి పనులను ప్రారంభించాలన్నారు. సమావేశంలో ఎస్.ఈ. భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏడిహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నిబంధనల మేరకే నిర్మాణాలు..

నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా చేయాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ బ్రాడీపేట, బృందావన్ గార్డెన్స్, శ్యామల నగర్ ప్రాంతాల్లో ఎన్ఓసికి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబందనల మేరకే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్ మూర్తి, ఏ.సి.పి. బాబురావు, టి.పి.ఎస్. హృదయ రాజు పాల్గొన్నారు.

పన్ను రాయితీకి 9 రోజులే గడువు..

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన ఆస్తి పన్నును ఏక మొత్తంగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుందని, పన్ను చెల్లింపుదారులకు వీలుగా సెలవు రోజుల్లోనూ క్యాష్ కౌంటర్లు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో పన్ను రాయితీపై ప్రజలకు అవగాహనకు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పన్ను డిమాండ్ మొత్తం ఆన్ లైన్‌లో పొందుపరచడమైనదని, కావున ఆస్తి, ఖాళీ స్థల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్ సిహెచ్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు బాలాజీ బాష, రవి కుమార్, రెహమాన్ పాల్గొన్నారు.